## పెద్దాపూర్ గురుకుల ప్రిన్సిపాల్ సస్పెండ్

**ఉత్తర్వులు జారీ చేసిన జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్**

జగిత్యాల/ మెట్‌పల్లి రూరల్, జూలై 27: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కే విద్యాసాగర్‌రావు సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు కలెక్టర్ సత్యప్రసాద్ శనివారం రాత్రి ఉత్తర్వులను జారీ చేశారు. శుక్రవారం గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి గణాధిత్య మృతి చెందడంతోపాటు మరో ఇద్దరు విద్యార్థులు గణేశ్, హర్షవర్ధన్ అస్వస్థతకు గురైన విషయంలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యార్థి మృతి, అస్వస్థతకు గురైన విద్యార్థుల పరిస్థితిని ఉన్నతాధికారులకు ప్రిన్సిపాల్ తెలియజేయలేదన్నారు. విచారణలో ప్రిన్సిపాల్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్టు తేలడంతో సస్పెండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. సస్పెన్షన్ ఉత్తర్వులు సత్వరమే అమలులోకి వస్తాయని తెలిపారు.


ధర్మారం: నంది పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి ఎగిసి పడుతున్న గోదావరి జలాలు

# పట్టాలు తప్పిన రైలు 'బండి'




**కరీంనగర్ ఉమ్మడి జిల్లాపై** కేంద్రం వివక్ష కొనసాగుతున్నది. సాధారణ నిధుల విషయంలోనే కాదు, రైల్వే కేటాయింపులోనూ అన్యాయం జరిగింది. ఎన్నో ఆశలు పెట్టుకున్న కరీంనగర్-కాజీపేట(హసన్‌పర్తి) రైల్వేలైన్‌కు సంబంధించి ప్రస్తావనే లేకపోవడం నిరాశపరిచింది. కీలకమైన కొత్తపల్లి-మనోహరాబాద్ లైన్‌కు నిధులు ఇచ్చినా, రాష్ట్ర వాటా మాత్రం అనుమానాలు రేకెత్తిస్తున్నది. మరో ప్రతిష్టాత్మకమైన మణుగూరు-రామగుండం-కోల్‌కారిడార్ లైన్‌కు కేవలం ₹5 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నది. ఇన్నాళ్లూ జిల్లాకు వందే భారత్ రైలు వస్తుందని ఊరించినా, కేంద్రం ఆ ముచ్చటే మరిచింది. ఇదిలా ఉంటే దక్షిణ భారత దేశంలోనే అత్యధిక ఆదాయాన్ని ఇస్తున్న కరీంనగర్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ, సౌకర్యాల మెరుగుకూ అణా పైసా కేటాయించకపోవడం, తిరుపతికి వీక్లీ సర్వీసులు పెంచకపోవడం పరిస్థితికి అద్దంపడుతున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే ఓటాన్ అకౌంట్ పద్దుకు ఈ బడ్జెట్‌కు మధ్య దాదాపు ₹300 కోట్లకుపైగా కత్తెర పడగా, ప్రజానీకం మండిపడుతున్నది. అందుకే ప్రతిసారి బడ్జెట్ రాగానే గొప్పలు చెప్పే బీజేపీ నాయకులు ఈసారి కావాలనే మౌనం వహించారని విమర్శిస్తున్నది. వీటన్నింటికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఏం సమాధానం చెబుతారోనని ఎదురుచూస్తున్నది.

- ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు తాజా బడ్జెట్‌కు మధ్య ₹300 కోట్లకుపైగా కోతలు
- ఊసేలేని కరీంనగర్-కాజీపేట లైన్
- కరీంనగర్ - తిరుపతి వీక్లీ సర్వీసులు పెంచలేదు
- కొత్తపల్లి-మనోహరాబాద్‌కు ఓకే.. రాష్ట్ర సర్కారు నిధులపైనే అనుమానాలు
- రామగుండం-మణుగూరుకు కేవలం ₹5 కోట్లే
- వందే భారత్ రైలు ముచ్చటే కరువు
- కేంద్రమంత్రి బండి సంజయ్ సమాధానం కోసం ప్రజల ఎదురుచూపులు

కరీంనగర్, జూలై 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ఈ నెల 23న ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అందులో రైల్వేలకు ₹2,62,200 కోట్లు కేటాయించగా, ఉమ్మడి జిల్లాకు మాత్రం అడుగడుగునా అన్యాయం జరిగింది. అటు సాధారణ బడ్జెట్‌లో జాతీయ రహదారుల నుంచి మొదలు మెడికల్ కళాశాల, నవోదయ, ట్రిపుల్ ఐటీ వంటి వాటి కేటాయింపుల విషయంలో పక్షపాతం చూసింది. ఇటు రైల్వేకు సంబంధించి మొండిచెయ్యే దిక్కయింది. కనీసం ఈ రంగానికి సంబంధించి అయినా న్యాయం జరుగుతుందని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశించినా నిరాశే మిగిలింది. రైల్వే రంగం కేటాయింపులకు సంబంధించి 'నమస్తే తెలంగాణ'కు అందిన సమాచారం ప్రకారం చూస్తే ఉమ్మడి జిల్లాపై కేంద్రం వివక్ష చూపినట్లు తెలుస్తున్నది.

### కరీంనగర్-కాజీపేట లైన్ ఊసేలేదు..

అత్యంత ప్రధానమైన కరీంనగర్-కాజీపేట(హసన్‌పర్తి) వయా హుజూరాబాద్ నూతన రైల్వే లైన్ ఏర్పాటుకు మాజీ ఎంపీ వినోద్‌కుమార్ గతంలో కేంద్రాన్ని ఒప్పించిన విషయం తెలిసిందే. ఆ మేరకు డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేసేందుకు రైల్వే బోర్డును కూడా ఆయన ఒప్పించగా, సర్వే కూడా పూర్తయింది. నిజానికి ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఇది అత్యంత ప్రధానమైన లైన్. కాజీపేట జంక్షన్‌తో ఒకసారి లింకు ఏర్పడితే ఉమ్మడి జిల్లా వాసులు భారతదేశంలో ఎక్కడికైనా వెళ్లడానికి సౌకర్యం కలుగుతుంది. ఈ మేరకు మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కేంద్రాన్ని ఒప్పించినా దానిని కంటిన్యూ చేసి నిధులు కేటాయింపు చేసుకోవడంలో బండి సంజయ్ ఎప్పుడూ విఫలమవుతూనే ఉన్నారు. ఈ లైన్‌కు సంబంధించి తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరినట్లు బండి పలుసార్లు తెలిపినా, బడ్జెట్‌లో ఈ లైన్ ఊసే లేదు. కనీసం 'చూస్తాం.. చేస్తాం' అన్న ముచ్చట కూడా లేదు. ఇంత ప్రాధాన్యత లైన్‌ను ఏ మాత్రం పట్టించుకోకుండా కేంద్రం ఉండడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై బండి ఏం చెబుతారో..? చూడాలి.

### రాష్ట్ర ప్రభుత్వంపై అనుమానాలు

కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వేలైన్‌కు కేంద్రం గత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ₹350 కోట్లు కేటాయించింది. అందులో రాష్ట్ర వాటాగా ₹112 కోట్లు వరకు వెచ్చించాలి. అంటే 2023-24 బడ్జెట్‌లో ₹185 కోట్లు కేటాయించారు. ఇప్పుడు తాజా బడ్జెట్‌లో ₹350 కోట్లు కేటాయించినట్టు కేంద్రం చెబుతున్నది. అయితే ఈ ఒక్క విషయం బాగానే కనిపిస్తున్నా రాష్ట్రం విడుదల చేయాల్సిన నిధులపైనే నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వే లైన్ పొడవు 151.34 కిలోమీటర్లు కాగా, అందులో మెదక్ జిల్లాలో 9.30 కిలోమీటర్లు, సిద్దిపేట జిల్లాలో 83.40 కిలోమీటర్లు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 37.80 కిలోమీటర్లు, కరీంనగర్ జిల్లాలో 20.86 కిలోమీటర్లు ఉండగా.. నాడు 2016లో తెలంగాణ సర్కారు కేంద్రాన్ని ఒప్పించి మంజూరు చేయించింది. ₹1,167 కోట్లతో అంచనాలతో ప్రారంభించిన ఈ లైన్ ఇప్పటివరకు మనోహరాబాద్ నుంచి సిద్దిపేట దాకా పూర్తయి రైలుసేవలు అందుబాటులోకి వచ్చాయి. మొత్తం 151 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గం ఇప్పటివరకు 75కిలోమీటర్లు పూర్తయింది. ప్రస్తుతం సిరిసిల్ల-సిద్దిపేట (37కి.మీ) భూసేకరణ ప్రక్రియ జరుగుతున్నది. నిజానికి ఈ లైన్‌పూర్తయితే రాష్ట్ర రాజధానితో అనుసంధానం ఏర్పడుతుంది. అందుకే ఈ లైన్ కోసం ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పట్టుబట్టి కేంద్రాన్ని ఒప్పించారు. స్వయంగా ప్రధాని మోడీతో దీనికి శంకుస్థాన చేయించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర సర్కారు సైతం తన నిధులను విడుదల చేసి, భూసేకరణ, ఇతర కార్యక్రమాలపై దృష్టిపెడితే తప్ప దీని లక్ష్యం నేరవేరదన్న అభిప్రాయాలున్నాయి.

### భారీ కోతలు.. కోల్ కారిడార్‌కు మళ్లీ అన్యాయమే

రైల్వే బడ్జెట్‌లో ఈ సారి భారీకోతలు పడ్డాయి. ఈ యేడాది ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ₹673.43కోట్లు కేటాయించినట్టుగా లెక్కలు తేల్చారు. కానీ, ఈ సారి బడ్జెట్‌లో మరింత ఎక్కువగా వస్తుందని ఆశించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఈ సారి ఉమ్మడి జిల్లాకు రైల్వే రంగంపై వరాల జల్లు కురుస్తుందని ఆశించారు. కానీ బడ్జెట్ చూస్తే ప్రజలు ఆశలు ఆవిరయ్యాయి. కొత్తపల్లి - మనోహరాబాద్ (150 కిమీ) రైల్వేలైన్‌కు ₹350 కోట్లు కేటాయించిన కేంద్రం. రామగుండం - మణుగూరు-కోల్ కారిడార్ (202 కి.మీ) రైల్వేలైన్‌కు ₹5 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నది. ఉప్పల్ - జమ్మికుంట రైల్వే ఓవర్ బ్రిడ్జికి ₹2 కోట్లు, పెద్దపల్లి బైపాస్ (2.1 కి.మీ) లైన్‌కు ₹లక్ష, పెద్దపల్లి - కరీంనగర్- నిజామాబాద్ (177.కి.మీ) రైల్వే లైన్‌కు విచిత్రంగా ₹1000 మాత్రమే కేటాయించింది. అలాగే ముంబైకి ఒక్క కొత్త రైలు కూడా కేటాయించలేదు. కరీంనగర్ - తిరుపతి బై వీక్లీ సర్వీసులు పెంచలేదు. రాజధానికి ఎలాంటి కొత్త రైలు ప్రకటన లేదు. రామగుండం - మణుగూరు (200.కిమీ) రైల్వేలైన్‌కు ₹5 కోట్లు కేటాయించింది. దీని మొత్తం అంచనా విలువ ₹3900 కోట్లు కాగా, ఇలా ₹5 కోట్ల చొప్పున కేటాయిస్తే ఇది ఎప్పటికీ పూర్తవుతుందో బీజేపీ నాయకులే సమాధానం చెప్పాలని ప్రజానీకం స్పష్టం చేస్తున్నది.

### ఆధునీకరణకు నిధులేవు.. వందేభారత్ ముచ్చటలేదు

దక్షిణ మధ్య రైల్వేకు సంబంధించి అత్యధిక ఆదాయాన్ని ఇస్తున్నది కరీంనగర్ రైల్వేస్టేషన్. గ్రానైట్, మక్కల ఎగుమతుల వంటి వాటితో గత కొన్నేండ్లుగా అత్యధిక ఆదాయాన్ని ఇస్తున్నది. ఈ స్టేషన్ ఆధునీకరణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. అంతేకాదు ఇక్కడి వ్యాపార, వాణిజ్య వర్గాలు కావాల్సిన సౌకర్యాల కల్పన కోసం దక్షిణ మధ్య రైల్వే అధికారులకు వినతులు చేస్తూనే ఉన్నారు. కానీ, ఒక్క పైసా కేటాయించలేదు. అలాగే వందేభారత్ రైలు సేవలు ఉమ్మడి జిల్లా వాసులకు త్వరలోనే అందుతాయని బండి సంజయ్ గతంలో ప్రకటించారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు సైతం వందే భారత్‌కు అనుగుణంగా ఈ రూట్లలో వేగాన్ని పెంచేందుకు ఏర్పాట్లు చేసినట్టుగా ఇటీవల ప్రకటించారు. పెద్దపల్లి-కరీంనగర్ మధ్య 100 కిలోమీటర్ల స్పీడ్, కరీంనగర్-జగిత్యాల(లింగంపేట) మధ్య 90 కిలోమీటర్లు, జగిత్యాల-నిజామాబాద్ 100 కిలోమీటర్లు, మేడ్చల్ -మనోహరాబాద్ మధ్య 110 కిలోమీటర్ల స్పీడ్‌తో నడిపేలా రైల్వేలైన్లను ఆధునీకరించినట్లుగా ప్రకటించారు. తీరా బడ్జెట్‌లో చూస్తే ఇందుకు సంబంధించిన ముచ్చటే లేదు.

### బండి ఏం చెబుతారో..

నిజానికి బడ్జెట్ తర్వాత దక్షిణ మధ్య రైల్వేకు సంబంధించి కేటాయింపులు, ఇతర వివరాలు తెలుపుతూ ఒక పింక్ బుక్‌లెట్ విడుదల చేస్తారు. కానీ, ఈ సారి అది బయటకు రాలేదు. అలాగే బడ్జెట్ పూర్తయిన తర్వాత ఆయా జిల్లాలు, పార్లమెంట్ నియోజకర్గాలకు జరిగిన కేటాయింపులకు సంబంధించి ఎంపీలు, తమ పరిధిలో వచ్చిన నిధుల వివరాలను మీడియాకు తెలుపుతారు. కానీ, బడ్జెట్ పెట్టి రోజులు గడుస్తున్నా అత్యంత ప్రాధాన్యత గల రైల్వే కేటాయింపుల విషయాన్ని మాత్రం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి గానీ, ఆ పార్టీ అనుచరులుగా ప్రకటించలేదు. దీనిని బట్టి చూస్తే ఈ వివరాలన్ని తెలిసే వారు ప్రకటించలేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వ్యక్తమవుతున్న ప్రశ్నలకు బండి ఏం సమాధానం చెబుతారో చూడాలని, లేదా కేంద్ర మంత్రులతో మాట్లాడి.. మళ్లీ ఏమైనా అదనపు నిధులు తెస్తారా..? అన్నది వేచి చూడాల్సి ఉందని చర్చించుకుంటున్నారు.

**ఉప్పొంగిన గోదావరి**

# కేటీఆర్ అల్టిమేటం.. కాళేశ్వరం మోటర్లు ఆన్

- దిగొచ్చిన రాష్ట్ర సర్కారు
- లింక్-2లో మోటర్లు ఆన్
- నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల్లో ఎగిసిన జలాలు
- మిడ్‌మానేరుకు 12,600 క్యూసెక్కులు
- కాంగ్రెస్ కుట్రలు పటాపంచలు
- ఆనందంలో రైతులు


రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి ఉప్పొంగుతున్న కాళేశ్వరం జలాలు

**కేటీఆర్ సవాల్‌కు కాంగ్రెస్ సర్కారు దిగొచ్చింది. కాళేశ్వరం పంపులను ఆగస్టు 2 లోగా ఆన్ చేయకుంటే 50 వేల మంది రైతులతో వచ్చి తామే ఆన్ చేస్తామని ఇచ్చిన అల్టిమేటానికి తలొగ్గింది. 24 గంటల్లోనే మధ్యమానేరు (శ్రీ రాజరాజేశ్వర) ప్రాజెక్టుకు ఎత్తిపోతలను ప్రారంభించింది. శనివారం ధర్మారం మండలం నంది పంప్‌హౌస్‌లో 4, రామడుగు మండలం గాయత్రీ పంప్‌హౌస్‌లో 4 బాహుబలి మోటర్లను ఆన్ చేసింది. మొత్తంగా 12,600 క్యూసెక్కులను ఎత్తిపోస్తుండగా, రైతాంగం ఆనందపడుతున్నది. అన్నీ మంచిగానే ఉన్నాయని, కాంగ్రెస్ కావాలనే నీళ్లియ్యకుండా తమ పొలాలు ఎండబెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది.**

కరీంనగర్, 27 జూలై (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ రామడుగు/ బోయిన పల్లి, జూలై 27: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కారు దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో సాగిన బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం పర్యటన విజయవంతమైంది. గురువారం సాయంత్రం లోయర్‌మానేరు డ్యాంను పరిశీలించి, శుక్రవారం లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్, లక్ష్మీ (కన్నెపల్లి) పంప్ హౌస్‌ను పరిశీలించింది. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించి కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోయడంలో సర్కారు చేస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే ఆగస్టు 2 వరకు ప్రభుత్వానికి గడువు ఇస్తున్నామని, అప్పటికీ లక్ష్మీ పంపుహౌస్ నుంచి నీటిని పంపింగ్ చేయకపోతే, 50 వేలమంది రైతులతో వచ్చి తామే ప్రారంభిస్తామని అల్టిమేటం జారీ చేశారు. దీంతో కాంగ్రెస్ సర్కారు కేటీఆర్ సవాల్‌కు దిగొచ్చింది. రైతులతో కలిసి వచ్చి మోటర్లు ఆన్ చేస్తే తమకు చెడ్డ పేరొస్తుందని భావించి దిద్దుబాటు చర్యలకు పూనుకున్నది. ఈ మేరకు అల్టిమేటం ఇచ్చిన 24 గంటల్లోనే ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టింది.

### ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు జలాలు

కేటీఆర్ సవాల్‌తో దిగొచ్చిన ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లో పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లి బరాజ్ నుంచి సిరిసిల్ల జిల్లా మధ్య మానేరుకు నీటిని తరలిస్తున్నది. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంపుహౌస్‌లో నాలుగు (4, 5, 6, 7 నంబర్లు) మోటర్లు ఆన్ చేసింది. ఒక్కో పంపు ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున 12,600 క్యూసెక్కులను కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు ఎత్తిపోస్తున్నది. అక్కడ నాలుగు బహుబలి మోటర్లు ఆన్‌చేసి జలాలను వరదకాలువ ద్వారా మధ్యమానేరు ప్రాజెక్టుకు పంపిస్తున్నారు. ప్రస్తుతం నడుస్తున్న మోటార్ల ప్రకారం చూస్తే.. రోజుకు 1.2 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తున్నారు. నిజానికి నందిమేడారం, అలాగే గాయంత్రి పంపుహౌస్ వద్ద ఏడు మోటార్లు ఉన్నాయి. మొత్తం పంపులను ఆన్‌చేస్తే రోజుకు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోవచ్చు.

### కాంగ్రెస్‌పై మండిపడుతున్న రైతులు

బీఆర్‌ఎస్ పాలనలో నిండుగా దర్శనమిచ్చిన జలాశయాలు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. 90 టీఎంసీల కెపాసిటీ ఉన్న ఎస్సారెస్పీలో 25 టీఎంసీల కంటే తక్కువగా నీళ్లు ఉండగా, 24 టీఎంసీల ఎల్‌ఎండీలో 5 టీఎంసీలు, 26 టీఎంసీల కెపాసిటీ ఉన్న మిడ్ మానేరులో సైతం 6.87 టీఎంసీల వరకు ఉన్నాయి. ఈ తరుణంలో ఇప్పటికే సాగు, తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. గతంలో ఇలాంటి పరిస్థితుల్లో కాళేశ్వరం మోటర్లు ఆన్‌చేసి నీటిని ఎత్తిపోసుకున్నా.. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. నేషనల్‌డ్యాం సేఫ్టీ అథారిటీ అధికారులు చెప్పారని, అందుకే తాము లక్ష్మీ పంపుహౌస్ నుంచినీటిని ఎత్తిపోసేది లేదని కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వాదిస్తున్నది. అయితే మేడిగడ్డ వద్ద 5,39,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దాదాపు రోజుకు 50 టీఎంసీల నీరు సముద్రం పాలవుతున్నది. ఇటు ఎల్లంపల్లి నుంచి నీటికి ఎత్తిపోసే అవకాశమున్నా మొన్నటి దాకా ప్రభుత్వం ముందుకు రాలేదు. 20.175 టీఎంసీల సామర్థ్యమున్న ఎల్లంపల్లిలో ప్రస్తుతం 17.3969 టీంఎసీలు ఉండగా.. ఇన్ ఫ్లో 12,931 క్యూసెక్కులు ఉన్నది. ఇప్పుడు కేటీఆర్ ఇచ్చిన అల్టిమేటంతో ప్రభుత్వం నీటిని ఎత్తిపోసేందుకు చర్యలు తీసుకున్నది. అయితే ఇదే పని ముందే చేస్తే బాగుండేదని రైతులు మండిపడుతున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ కుట్రలు బయటపడ్డాయని, ఇన్నాళ్లూ నీళ్లిచ్చే అవకాశమున్న ఎందుకివ్వలేదంటున్నారు. తమ తరపున కేటీఆర్ వచ్చి నిలదీసే దాకా ప్రభుత్వానికి పరిస్థితి అర్థం కాలేదా..? అని ప్రశ్నిస్తున్నారు. అయితే లోయర్‌మానేరు డ్యాం, అన్నపూర్ణ జలాశయం, ఎగువమానేరు, రంగనాయకసాగర్, కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టులు నింపుకోవాలంటే.. దాదాపు 200లకుపైగా టీఎంసీల వరకు నీళ్లు అవసరం పడుతాయని, దీనికి కన్నెపల్లి నుంచి ఎత్తిపోతలే శాశ్వత పరిష్కారమని చెబుతున్నారు. ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోస్తున్నామంటూ గొప్పలు చెప్పకుండా శాశ్వత పరిష్కారానికి చొరవ చూపితేనే తమ ప్రయోజనాలు నెరవేరుతాయని స్పష్టం చేస్తున్నారు.


నిండుగా శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం


గాయత్రీ పంప్‌హౌస్ వద్ద కాళేశ్వరం జలాలకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## ఇది రైతుల విజయం

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- గాయత్రీ పంప్‌హౌస్ వద్ద కాళేశ్వరం జలాలకు ప్రత్యేక పూజలు

రామడుగు, జూలై27 : కేటీఆర్ సవాల్‌కు ప్రభుత్వం దిగొచ్చి పంపులు ఆన్ చేసిందని, ఇది పూర్తిగా బీఆర్‌ఎస్, రైతుల విజయంగా భావిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ చెప్పారు. అబద్ధపు మాటలతో ప్రజల్ని మోసం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పటికైనా నిజాలను చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం ఆయన రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ వద్ద విడుదలైన కాళేశ్వరం జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గోదావరి నిండుగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ మీద ఉన్న కక్షతో ఎత్తిపోతలు ప్రారంభించడం లేదని ధ్వజమెత్తారు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతులకు నీళ్లివ్వకుండా ఆగం చేస్తున్నదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి నీళ్ల విషయంలో మేడిగడ్డ కూలిపోతుందని, గోదావరిలో కొట్టుకపోతుందని ఆనాడు చెప్పిన మాటలను, ఈ రోజు కూడా అసెంబ్లీలో మాట్లాడే ప్రయత్నం చేయడం దురదృష్టకరం అని అన్నారు. లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లోను తట్టుకొని మేడిగడ్డ బ్యారేజీ నిలబడ్డా వారికి కనిపించడం లేదన్నారు. జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నా కూడా కాంగ్రెస్ సర్కారుకు నీళ్లివ్వాలనే సోయి లేదని విమర్శించారు.


మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

## మద్యం బాటిళ్లు ధ్వంసం

ఈ చిత్రంలో రోడ్డురోలర్ ముందు ఉన్న బీరు సీసాలు ఖాళీవి అనుకుంటే పొరపాటే. అవి సీల్ తీయని బాటిళ్లు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ధర్మపురిలో పలువురు అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న ₹6లక్షల విలువైన 177 కేసుల బీర్లను శనివారం పోలీసులు ధ్వంసం చేశారు. కోర్టు ఆదేశాల మేరకు డీఎస్పీ రఘుచందర్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎక్సైజ్ సీఐ మహేందర్‌సింగ్ ఆధ్వర్యంలో సీసాలను రోడ్డు రోలర్‌తో తొక్కించారు.

- ధర్మపురి, జూలై27

## సేవలు అంతంతే

సీజనల్ వ్యాధులతో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తాకిడి పెరుగుతున్నది. అయితే అందుకనుగుణంగా సేవలు అందడం లేదని తెలుస్తున్నది. శనివారం దవాఖానలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పెషెంట్లను కుటుంబసభ్యులే ఇలా వీల్‌చైర్లలో తీసుకెళ్లాల్సి వచ్చింది. వైద్యుల వద్దకు, ల్యాబ్‌కు ఇలా తీసుకెళ్లడం కనిపించింది.

- కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్


పెషేంట్లను తీసుకెళ్తున్న కుటుంబసభ్యులు




స్కూల్‌కు వెళ్లే దారిలో చూర పోయిస్తున్న అధికారులు


## బురద రోడ్డుకు మరమ్మతులు

**'నమస్తే' కథనానికి స్పందించిన అధికారులు**

మంథని రూరల్, జూలై 27: 'ఎక్లాస్‌పూర్ స్కూల్ అధ్వానం' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' లో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు తక్షణ చర్యలు చేపట్టి పాఠశాల ఆవరణలో బురద ఉన్న చోట్లలో చూర నింపారు. ఈ పనులను ఎంపీడీవో పూర్ణచందర్, ఏఈ అనుదీప్ దగ్గరుండి పర్యవేక్షించారు. పిల్లలు తరగతి గదులకు రావడానికి బురద ఇబ్బందులు తొలగడంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఇటు 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఏఈ అనుదీప్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధి పనుల్లో భాగంగా కలెక్టర్ ₹10 లక్షల నిధులు మంజూరు చేయించారని, వర్షాల కారణంగా పనులు ప్రారంభం కావడం లేదని, తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

# హైదరాబాద్ ధర్నాకు నేతన్నలు


హైదరాబాద్‌కు బయలు దేరుతున్న నేత కార్మికులు


ఇందిరాపార్కు వద్ద ధర్నాలో..

రాజన్న సిరిసిల్ల, జూలై 27 (నమస్తే తెలంగాణ) : సమస్యల పరిష్కారం కోసం వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాలు (జేఏసీ) ఇచ్చిన పిలుపు మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాచౌక్ వద్ద మహాధర్నా చేశారు. సిరిసిల్ల నుంచి నేతన్నలు వందలాదిగా కదిలారు. యూనియన్ నాయకులు మూషం రమేశ్, పంతం రవి, కోడం రమణ, తాటి పాముల దామోదర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సుల్లో బయలు దేరి వెళ్లారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ, వస్త్ర పరిశ్రమ సంక్షోభం ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ₹180 కోట్లు, యార్న్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నేతన్నలకు ఉపాధి కల్పించేందుకు వెంటనే 15 కోట్ల మీటర్ల వస్త్ర ఆర్డర్లు ఇవ్వాలని, పది హెచ్‌పీల యూనిట్ వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. వర్కర్ టూ ఓనర్ పథకం పూర్తి చేసి కార్మికులకు ఇవ్వాలని కోరారు. నేతన్న ప్రాణాలు కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.